మత్స్య సంపదకు భద్రత ఏదీ?

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- ఇసుక దిబ్బలపైనే ఎండు చేపలు
- పాకల్లోనే ఇంజిన్లు, వలలు
- స్టోర్ రూములు లేక గంగపుత్రుల ఇబ్బందులు

తుపాను ప్రకటన వస్తే చాలు గంగపుత్రులకు బెంగపట్టుకుంటుంది. కంటి మీద కునుకు ఉండదు. ఏక్షణాన సముద్రం ఉగ్రరూపం దాల్చి తీరంపైకి దండెత్తుతుందో, ఇసుక తిన్నెలపై భద్రపరచుకున్న వలలు, ఇంజిన్లు, తెప్పలు ఎక్కడ కెరటాల ధాటికి కొట్టుకుపోతాయోనని ఆందోళన చెందుతుంటారు. ఒక పక్క ప్రాణాలు.. మరో పక్క జీవనాధారమైన వలలు, ఇంజిన్లు కాపాడుకోవడం కోసం మత్స్యకారులు పడే కష్టాలు వర్ణనాతీతం. స్టోర్ రూములు లేకపోవడంతో చాలా ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి.

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో సుమారు 30 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. 17 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 25 వేల మందికి పైగా మత్స్యకారులు జీవిస్తున్నారు. ఈ గ్రామాల నుంచి సుమారు 6 వేల మంది తెప్పలు, మోటారు ఇంజిన్లతో వేట సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో వేటాడిన మత్స్య సంపదను ప్రతి శుక్రవారం నక్కపల్లిలో జరిగే వారపు సంత ద్వారా విశాఖ, హైదరాబాద్, కోల్‌కతా, తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. నెలకు ఈ ప్రాంతం నుంచి సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతి అవుతోంది. అయినా కనీస సౌకర్యాలు లేక గంగపుత్రులు సతమతమవుతున్నారు. తీర ప్రాంతాలను ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో కనీస సదుపాయాలు లేవు. వలలు, ఇంజిన్లు, తెప్పలు భద్రపరచుకునేందుకు షెడ్లు లేవు. వేటాడి తెచ్చిన మత్స్య సంపదను భద్రపరచుకోవడం, ఎండ బెట్టుకునేందుకు, మార్కెటింగ్ చేసుకునేందుకు ప్లాట్ ఫారాలు గానీ, స్టోర్ రూములు గానీ అందుబాటులో లేవు. సముద్రపు ఒడ్డున ఇసుక తిన్నెల్లోనే చేపలను ఎండబెట్టుకోవాల్సిన దుస్థితి ఉంది. ప్రస్తుతం ఇసుక దిబ్బలపై పందెళ్లు వేసి వలలు, ఇంజిన్లు, భద్రపరుస్తున్నారు. వేట పూర్తయిన తర్వాత, తుపాను హెచ్చరికల సమయంలో తెప్పలు, బోట్లకు కూడా రక్షణ ఉండడం లేదు. కెరటాల ఉధృతికి తెప్పలు, ఇంజిన్లు సముద్రంలోకి కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మరో వైపు ఇసుక తిన్నెలపై ఎండబెట్టిన చేపలకు సరైన గిట్టుబాటు ధర రాదని, సిమెంట్ ప్లాట్ ఫారాలపై ఎండబెడితే మంచి ధర వస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. పాడైన వలలు, మోటారు బోట్లు, తెప్పలకు ఇసుక దిబ్బలపైనే మరమ్మతులు చేపట్టాల్సి వస్తోంది. స్టోర్‌రూములు, షెడ్లు, ప్లాట్‌ఫారాలు ఉంటే అక్కడ ఎంచక్కా మరమ్మతులు చేసుకోవడానికి వీలుంటుందని వారు అంటున్నారు.



ఆరుబయటే వలలు రిపేరు చేసుకుంటున్న మత్స్యకారులు



ఇసుక దిబ్బలపైనే చేపలను ఎండ బెట్టిన దృశ్యం



పెంటకోటలో షెడ్లు లేక ఇసుక దిబ్బలపై పందిళ్లు వేసి భద్రపరిచిన వలలు, ఇంజిన్లు

అందని మత్స్యకార భరోసా

వరుస వాయు గుండాలతో వేటకు దూరమై పస్తులుంటున్నామని, ప్రతి ఏటా ఇచ్చే మత్స్యకార భరోసా కూడా ఈ ఏడాది ఇంత వరకు అందలేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసింది. రూ.22 కోట్లు కేటాయించినప్పటికీ స్థల సమస్య వల్ల నిర్మాణానికి నోచుకోలేదు. ఈ నిధులతో జెట్టీ నిర్మిస్తే మత్స్యకారుల కోసం ప్లాట్ ఫారాలు, స్టోర్‌రూములు ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫిష్ ల్యాండింగ్ సెంటరు నిర్మించాలని, తీర ప్రాంతాల్లో మత్స్యకారుల కోసం స్టోర్ రూములు, షెడ్లు నిర్మించాలని గంగపుత్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చాలా నష్టపోతుంటాం



తీర ప్రాంతంలో మత్స్యకారుల కోసం ఎటువంటి సదుపాయాలు లేవు. తుపానులు సంభవించినప్పుడు కెరటాల ఉధృతికి ఒడ్డున ఉన్న తెప్పలు కొట్టుకుపోతున్నాయి. చాలా నష్టపోతుంటాం. ప్రాణాలకు తెగించి ఒడ్డున కాపాలా కాయాల్సి వస్తుంది. చేపలు ఎండబెట్టుకునేందుకు సిమెంట్ ప్లాట్ ఫారాలు నిర్మించాలి. వలలు, ఇంజిన్లు, తెప్పలు భద్రపరుచుకోవడం కోసం షెడ్లు కట్టాలి. మత్సకార భరోసా కూడా తక్షణం మంజూరు చేయాలి.

– అప్పలరాజు, మత్స్యకారుడు, రాజయ్యపేట

తక్షణం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మించాలి



తీర ప్రాంతం వెంబడి గంగమ్మతల్లిని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులకు షెడ్లు, ప్లాట్ ఫారాలు నిర్మించాలి. వలలు, ఇంజిన్లు భద్రపరచుకునేందుకు ఏర్పాట్లు చేయాలి. గతంలో చాలా సార్లు లంగరు వేసిన తెప్పలు, బోట్లు కెరటాలకు కొట్టుకుపోయాయి. కనీస సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటరు పనులు వెంటనే ప్రారంభించాలి. ఇది పూర్తి చేస్తే మత్స్యకారుల కష్టాలు తీరుతాయి.

– చోడిపల్లి శ్రీను, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రారంభం



భిక్ష సదుపాయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆలయ ప్రాంగణంలో ఉచిత భిక్ష సదుపాయం కల్పిస్తూ మాలలు ధరించిన భక్తులకు సేవలందించడం సంతోషకరమన్నారు. 40 రోజుల పాటు జరిగే భిక్ష సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వేగి లక్ష్మణరావు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, సూరిశెట్టి కన్నారావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాజుపేటలో వసతుల కల్పనకు కృషి



రాజుపేటలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ దేముడు

మునగపాక: రాజుపేట గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కిలాడి దేముడు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.7 లక్షల వ్యయంతో జెర్రిపోతుల కృష్ణ ఇంటి నుంచి కమ్యూనిటీ హాల్ వెనక వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఆయన బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపేటలో సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి అభివృద్ధి పనులు దశల వారీగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెర్రిపోతుల కనకమహాలక్ష్మి, వార్డు సభ్యురాలు పడాల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


అయోడిన్ ఉప్పు వినియోగం తప్పనిసరి



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ మళ్ల

మునగపాక: తీసుకునే ఆహారంలో అయోడిన్ లేని ఉప్పు వాడకం వల్ల ప్రమాదకరమైన రోగాల బారిన పడాల్సి వస్తుందని మునగపాక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ మళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. మునగపాకలోని ప్రణతి హైస్కూల్‌లో బుధవారం ప్రజా ప్రగతి ట్రస్ట్ తిరుపతి, న్యూట్రిషన్ ఇండియా అండ్ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ సహకారంతో క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం కారణంగా పిల్లలకు కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడకపోవడం వల్ల థైరాయిడ్, గొంతు వాపు వ్యాధి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకాంత, క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి నాగేశ్వరరావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



రామన్నపాలెంలో పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల: పల్లెల్లో చెత్త పేరుకుపోతోంది. నెలల తరబడి పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. రహదారుల పక్కన పేరుకుపోతున్న చెత్తతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా చెత్త స్వాగతం పలుకుతోంది. రామన్నపాలెంలో పారిశుధ్యం క్షీణించింది. రహదారుల వెంబడి భారీగా చెత్త పెరిగిపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో రోగాలు ముసురుకుంటున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాల సేకరణ ధర పునరుద్ధరించాలని ఆందోళన



వెంకటాపురంలో ఆందోళన చేస్తున్న రైతులు

మునగపాక: తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని వెంకటాపురం, తోటాడ పాల కేంద్రాల ఎదుట రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సరికాదని సీఐటీయూ నేతలు గనిశెట్టి సత్యనారాయణ, ఆళ్ల మహేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు ఆరోపించారు. రైతులు చేస్తున్న ఆందోళనకు వారు మద్దతు తెలిపారు. రైతులకు న్యాయం చేయకుంటే 29న డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు బోనస్ కూడా చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఈ ఆందోళనలో రైతులు కాండ్రేగుల రామసూరప్పారావు, సిరి వరహాలరాజు, ఏదూరి రమణ, పండూరి తాతయ్య, చిన్ని రామారావు, సుందరపు అప్పారావు, పండూరి లక్ష్మి, నాగరాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



చినదొడ్డిగల్లు పాఠశాలలో మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ



వమ్మవరం పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం డి.రమేష్

నక్కపల్లి: చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకటరమణ ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సొంత ఖర్చులతో ఈ మెటీరియల్‌ను అందజేసినట్లు రమణ తెలిపారు. స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉపకార వేతనాలు పొందాలని ఆకాంక్షించారు.

ఎస్.రాయవరం: వింగ్స్ ఫౌండేషన్ సమకూర్చిన ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను వమ్మవరం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ అందజేశారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణను ఆయా తరగతి ఉపాధ్యాయులు ఇవ్వాలని ఆయన సూచించారు.

ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

పాయకరావుపేట: మండలంలో ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీరామమూర్తి తెలిపారు. భూమి చానల్, ముఠా, మంగవరం, మాసాహేబుపేట, ఆవ, రాజవరం చానళ్లు, కనుమల చెరువు సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. భూమి చానల్ కింద పాయకరావుపేట, అరట్లకోట, పీఎల్ పురం, నామవరం, చినరాంభద్రపురం, దేవవరం, గొడిచెర్ల గ్రామాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉన్నారని, ముఠా చానల్ పరిధిలో అన్నవరం, కవలపాడు, పెదరాంభద్రపురం, ఎస్.నర్సాపురం, శ్రీరాంపురం, కేశవరం, కుమారపురం, కందిపూడి, ఈదటం గ్రామాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. మంగవరం చానల్ పరిధిలో మంగవరం, గునిపూడి, అరట్లకోట, మాసాహేబుపేట, సత్యవరం గ్రామాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉన్నారన్నారు. ఆవ చానల్ పరిధిలో సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, గునిపూడి, గ్రామాల ఆయకట్టు రైతులు, రాజవరం ఛానల్ కింద రాజవరం, కేశవరం గ్రామాల ఆయకట్టు రైతులు, కనుమల చెరువు పరిధిలో పాల్తేరు గ్రామ ఆయకుట్ట రైతులు ఓటర్లుగా ఉన్నట్లు ఏఈ తెలిపారు. వచ్చే నెల 10న ఓటర్ల జాబితా విడుదల చేస్తారని, 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, 21 నుంచి 23వ తేదీ మధ్యలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి : జాబ్ కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారంతా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జంగిల్ క్లియరెన్స్, పంట కాలువల నిర్మాణం, ఉద్యానవన పంటలు తదితర పనులు చేపట్టాలన్నారు. వలసల నిరోధానికి ఉపాధి పనులు దోహదపడతాయన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మినీ గోకులా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీ సాధారణ నిధుల మ్యాచింగ్‌తో గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభిజిత్ పరిశ్రమను తెరిపించాలి



రాంబిల్లిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి (యలమంచిలి): అభిజిత్ పరిశ్రమ లే–ఆఫ్ ఎత్తివేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ రాంబిల్లి మండల నేతలు డిమాండ్ చేశారు. పరిశ్రమను తెరిపించాలంటూ మండల కేంద్రం రాంబిల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం జోక్యం చేసుకుని అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న అభిజిత్ పరిశ్రమ లే–ఆఫ్ ఎత్తివేసి 1000 మంది కార్మికులకు తక్షణమే ఉపాధి కల్పించాలని కోరారు. పరిశ్రమను హఠాత్తుగా మూసివేయడంతో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా లాకౌట్ విధించిన పరిశ్రమ యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ తెరిచే వరకు కార్మికులకు జీతాలు చెల్లించాలని, పెండింగ్ బోనస్‌లు తక్షణమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.చిన్న నూకరాజు, నారాయణరావు, అప్పారావు, సత్తియ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే వినతి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని ఎస్ఈజెడ్‌లో అభిజిత్ కంపెనీని తిరిగి తెరిపించేలా చూడాలని కోరుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వినతిపత్రం అందజేశారు. విజయవాడలో మంత్రి రవికుమార్‌ను ఆయన కలిసి కొద్ది రోజుల కిందట అభిజిత్ కంపెనీ లే–ఆఫ్ ప్రకటించిందని, దీంతో ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారని వివరించారు. సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని విజయకుమార్ తెలిపారు.

వరిలో చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు



మామిడివాడలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి విజేత



రాంబిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సాయిప్రియ



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న పాయకరావుపేట వ్యవసాయ శాఖ అధికారులు



గుడివాడ గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): వరి పంటలో చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి విజేత రైతులకు సూచించారు. రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామంలో రైతులకు వరి పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో ఆకు ముడత, పొడతెగులు, సుడిదోమ వంటి తెగుళ్లు పొటాష్ లోపంతో సోకుతాయన్నారు. పూత దశలో ఉంటే ఉదయం 8 నుంచి 11 గంటల లోపు పొలాల్లో మందులు పిచికారీ చేయరాదని, 12 గంటల తర్వాత పిచికారీ చేసుకోవాలని సూచించారు.

రాంబిల్లిలో పొలం పిలుస్తోంది

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం జెడ్.చింతువా రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన అధికారి సాయిప్రియ రైతులకు కొబ్బరి పంటలకు ఆశించే తెల్ల తెగులుపై అవగాహన కల్పించారు. రైతులంతా కలిసి సామూహిక నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కొబ్బరిలో అంతర పంటల కింద కోకో సాగు చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తే ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చునన్నారు. సూక్ష్మ సేద్యం పథకంలో భాగంగా రాయితీపై మంజూరు చేసే డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

పాయకరావుపేట: మండంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల్ వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తూటికాడ కషాయం పిచికారీ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీరామమూర్తి, తాండవ రైతు సంఘం సీఈవో సత్యనారాయణ, వీహెచ్ఏ వీరబాబు, వీఏ గోపి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: సస్యరక్షణ చర్యలతో వరిలో చీడ పీడలను నివారించవచ్చునని మండల వ్యవసాయాధికారి సౌజన్య అన్నారు. గుడివాడ, గుర్రాజుపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గోధుమ వర్ణపు, తెల్ల మచ్చ దోమలు దుబ్బుల అడుగున ఉండి రసాన్ని పీలుస్తాయని సౌజన్య చెప్పారు. నివారణకు పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలన్నారు. అవసరం మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు.

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన



వెంకటనగరంలో ఆర్‌వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలో పలు గ్రామాల్లో ఎంపీడీవో జయప్రకాష్‌రావు బుధవారం పర్యటించారు. కేశవరం, వెంకటనగరం, పాల్మన్‌పేట, ఈదటం గ్రామాల సచివాలయాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల అభివృద్ధిపై ఆరా తీశారు. వెంకటనగరం, పాల్మన్‌పేట గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలను పరిశీలించారు. వెంకటనగరం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో ఆర్‌వో ప్లాంటు నిర్వహణ తీరును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పి.ధర్మవరం విద్యార్థులు

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పి.ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. నక్కపల్లిలో బుధవారం నిర్వహించిన పోటీల్లో అండర్–14 విభాగానికి సంబంధించి విద్యార్థులు కె.నికిత, బి.నిహారిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను ఎంఈవో–2 సత్తిబాబు, పీడీ దీపిక, ఉపాధ్యాయుడు గారా ప్రకాష్, తదితరులు అభినందించారు.

రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆది మహేశ్వరరావు

మునగపాక: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ–సర్వేలో జరిగిన లోపాలను సవరించడంతో పాటు తేడాలను సరిచేస్తామన్నారు. రైతులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, గ్రామస్తులు మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, నూకప్పారావు, శేషు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు



పీటీ వెంకటరమణ, ఎక్సైజ్ అధికారి

అచ్యుతాపురం(మునగపాక): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని యలమంచిలి సర్కిల్ ఎక్సైజ్ అధికారి పి.టి.వెంకటరమణ హెచ్చరించారు. ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో భాగంగా 2024–26 సంవత్సరానికి యలమంచిలి పరిధిలోని అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాలకు 20 మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించామన్నారు. ప్రైవేటు మద్యం షాపుల లైసెన్సీలకు ప్రస్తుతం ఉన్న ప్రొవిజనల్ లైసెన్స్‌ను ఈ నెల 31 వరకు పొడిగించామన్నారు. మద్యం షాపులు దక్కించుకున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదన్నారు. అనధికారికంగా గ్రామాల్లో మద్యం విక్రయించినా, వేలం పాటలు నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం, నాటుసారా, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలని వెంకటరమణ కోరారు.

29 నుంచి అన్నపూర్ణమ్మవారి నిజరూప దర్శనం

అనకాపల్లి: మండలంలో బట్లపూడి గ్రామంలో అంజనేయస్వామి గుడి వెనుక కొండపైన అన్నపూర్ణమ్మదేవి ఆశ్రమంలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ అన్నపూర్ణమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు సోహం రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న అమ్మవారికి విశేష అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, 30న అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, 31న దీపావళి అమావాస్య సందర్భంగా ఉదయం 10 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి సారె ఊరేగింపు



మోసయ్యపేటలో దుర్గాదేవి సారె ఊరేగింపు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం మోసయ్యపేటలో బుధవారం దుర్గాదేవి సారె ఊరేగింపు కనుల పండువగా సాగింది. మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల పిండి వంటకాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.